నిబంధనలు తెలిసేలా..




కోరట్లగూడెంలో ఓటరు స్లిప్ ఇస్తున్న బీఎల్ఓ నిర్మల (ఇన్‌సెట్) ఓటరు ప్రతం

పూర్తి సమాచారంతో ఓటరు స్లిప్పుల ముద్రణ

- రూట్ మ్యాప్, క్యూఆర్ కోడ్‌లతో పాటు బీఎల్ఓల పేరు, ఫోన్ నంబర్ల వివరాలు
- ఇంటింటికీ అందజేస్తున్న బీఎల్ఓలు
- 25లోగా పంపిణీ చేయాలని అధికారుల ఆదేశం
- అందలేనివారికి పోలింగ్ కేంద్రాల వద్ద ఇచ్చేలా ఏర్పాట్లు

నేలకొండపల్లి: ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అందులో భాగంగానే కొత్తగా ముద్రించిన ఓటరు ప్రతంలో ఓటరు వివరాలన్నీ తెలిసేలా ఎన్నికల యంత్రాంగం ముద్రించింది. ఓటరు ఓటు వేసే పోలింగ్ కేంద్రంతో పాటు వారి సీరీస్ సంఖ్యను గుర్తించడానికి వీలుగా ఓటరు పత్రాలను పంపిణీ చేస్తున్నారు. గతంలో ఓటరు పత్రంలో కేవలం ఓటరు ఫొటోతో పాటు వివరాలు మాత్రమే ఉండేవి, కానీ ఈసారి ఎన్నికల్లో ఓటరు వివరాలన్నీ తెలిసేలా నూతన విధానంలో ఓటరు పత్రాన్ని రూపొందించారు.

అంతా కుడి, ఎడమ వైపునే..

ఓటరు పత్రంలో ఎడమ వైపున ఫొటో స్థానంలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. అంతేకాక పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను కూడా ముద్రించారు. అదే విధంగా కుడి వైపున శాసనసభ నియోజకవర్గం పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబరు, గ్రామం పేరు, పోలింగ్ కేంద్రం, ట్రోల్‌ఫ్రీ నంబర్ 1950లను ముద్రించారు. అంతేకాక పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి వీలుగా పత్రానికి వెనుక వైపున రూట్ మ్యాప్ కూడా ఉంది. పోలింగ్‌కేంద్రం ఏ ప్రాంతంలో ఉందో సూచించే విధంగా మ్యాప్‌తో పాటు బూత్ లెవల్ అధికారి పేరు, వారి ఫోన్ నంబర్‌ను ముద్రించారు.

25లోగా పంపిణీ..

ఈ నెల 25లోగా బూత్ లెవల్ అధికారులు బీఎల్ఓ ద్వారా ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంపిణీ పూర్తి చేయనున్నారు. వాటిని పంపిణీ చేసే సమయాన కుటుంబంలో ఓటరుగా నమోదైన వ్యక్తికి మాత్రమే ఇస్తున్నారు. ఒకవేళ స్లిప్పులు ఇచ్చే సమయాన ఇంట్లో ఎవరూ లేకపోతే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసే సహాయ కేంద్రంలో వారికి అందించనున్నారు. ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఓటరు పత్రంతో పాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒక దానిని వారి వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. లేదంటే ఓటు వేసేందుకు అధికారులు అనుమతించరు.

ఓటరుకు వీలుగా ఉండాలని..



ఎన్నికల సంఘం ముద్రించిన ఓటరు ప్రతం ఓటరుకు అర్థమయ్యేలా ముద్రించారు. దీంతో ఓటరు పోలింగ్ కేంద్రం, ప్రాంతం, ఇతరత్రా వివరాలు తెలుసుకునేందుకు వీలుగా ఉంది. ఓటరు ఇబ్బంది పడకుండా ఉండేలా ముద్రించారు. చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

– కె.జమలారెడ్డి, కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, నేలకొండపల్లి

సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు..



బీఎల్ఓల వివరాలతో ఓటరు ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం ముద్రించిన ఓటరు స్లిప్పులో టోల్ ఫ్రీ కూడా ఉండడంతో సమస్యలపై వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. సంఘం రూపొందించిన పత్రంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

– వల్లాల రాధాకృష్ణ, కొత్తకొత్తూరు, సర్పంచ్

ఎవరి సాయం అక్కర్లేదు..



ఎన్నికల సంఘం గతం కంటే భిన్నంగా పలు మార్పులు తీసుకొస్తున్నారు. ఓటరుకు నిబంధనలు అర్థమయ్యేలా ముద్రిస్తున్నారు. దీంతో ఎవరి సాయం అక్కర్లేకుండానే పోలింగ్ కేంద్రానికి వెళ్లి నేరుగా ఓటు వేయొచ్చు. వివరాలన్నీ తెలిసేలా ముద్రించడం చాలా బాగుంది.

– గరిడేపల్లి రామారావు, సుర్దేపల్లి, ఓటరు

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశా..



ఖమ్మంఅర్బన్: పుట్టకోటలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



52వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి

మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మంసహకారనగర్: తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఖమ్మంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశానని, నిత్యం పురవీధుల్లో తిరుగుతూ సమస్యలను ఎప్పటికప్పుడు సరిచేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టించానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 15, 33, 34, 45వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం, నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి ఓటర్లను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా అని తెలుసుకొని మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తే పథకాలు నిరంతరాయంగా అందుతాయని ఓటర్లకు వివరించారు. అరటిపండ్లు అమ్ముతూ, షూకు పాలిష్ చేస్తూ, టీ పెట్టి, పాన్ కడుతూ ఓటర్లను ఆకర్షించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిన మోటార్లు, ఎరువులు, విత్తనాల కోసం క్యూలు కట్టి లాఠీ దెబ్బలు తిన్న రోజుల నుంచి తెలంగాణ ఏర్పాటు చేసుకున్న తర్వాత సీఎం కేసీఆర్ నిరంతరాయంగా విద్యుత్, కొరత లేకుండా విత్తనాలు, ఎరువులు అందించి వ్యవసాయరంగాన్ని పండగలా మార్చారని చెప్పా రు. ప్రైవేటు ఉద్యోగులకు అండగా ఉంటానన్నారు. కొంతమంది నిత్యం నా వెంట ఉండి నమ్మకం ద్రోహంతో కత్తి పోట్లు పొడిచి వెళ్లారని, అలాంటి వారి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. కాగా, బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఆధ్వర్యాన పువ్వాడ అజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ తీశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాగా, పువ్వాడ గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి నగరంలోని 52వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేసి ఓటర్లను అభ్యర్థించగా.. కార్పొరేటర్ బి.వెంకట్‌కుమార్, పద్మ, బత్తుల తిరుమలరావు, శ్రీనివాస్, సురేష్, ఖాదర్, రమేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆంధ్రబ్యాంక్ కర్షక సేవా సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ వలరాజుతో పాటు వెంకట్, రెహ్మాన్, కోటి, రామకృష్ణ, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారిణికి సన్మానం



కృష్ణవేణిని సన్మానిస్తున్న కళా సాంస్కృతిక రంగాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: రంగస్థల కళాకారిణి, సామాజిక సేవకురాలు, న్యాయవాది డాక్టర్ వనం కృష్ణవేణిని పలువురు ప్రముఖులు, కళా సాంస్కృతిక ప్రతినిధులు సన్మానించారు. కృష్ణవేణి సామాజిక సేవలకు గుర్తింపుగా ఢిల్లీ మ్యూజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈనేపథ్యాన సోమవారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో స్వరసుధ మ్యూజిక్ అసోసియేషన్ 31వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె సేవలను కొనియాడుతూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్, నంది పురస్కార గ్రహీత, లలిత కవి హెచ్‌వీఎల్ ప్రసాద్ బాబు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, ఎండీ జమా, కె.లక్ష్మణమూర్తి, డాక్టర్ శశాంక, కె.మాధవరావు, వీ.వీ.రెడ్డి, పీజే వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి గెలుపునకు కృషి చేయాలి

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



కార్యకర్తలతో మాట్లాడుతున్న భట్టి

నేలకొండపల్లి: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయం కోసం ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్ నుంచి ముదిగొండ వెళ్తున్న సందర్భంగా మంగళవారం నేలకొండపల్లిలో ఆగి కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని, ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, తాతా అఖిల్, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాయ మాటలతో వచ్చే వారిని నమ్మకండి..



తిరుమలాయపాలెం: అజ్మీరతండాలో మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి



కూసుమంచి: పెరికసింగారంలో ఎమ్మెల్యే కుమార్తె దీపిక ప్రచారం

ఎమ్మెల్యే, పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మాయమాటలతో వచ్చే వారిని నమ్మి మోసపోవద్దని, వన్‌సైడ్ ఓటింగ్‌తో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధ కావాలని పాలేరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పాలేరు ప్రజలు నా కుటుంబసభ్యులుగా భావించి ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటూ సేవ చేశానని, ప్రజలు మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. గులాబీ జెండా నిరుపేదలకు అండగా నిలిచిందని, కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రపంచంలో ఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో అమలు చేశారన్నారు. తెల్ల రేషన్‌కార్డు గల ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందించడంతో పాటు రూ.5లక్షల బీమా వర్తింప చేస్తామన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

తాతయ్యను గెలిపించండి: కందాళ మనుమడు

పాలేరు ప్రజల సమస్యలపై నిత్యం పనిచేస్తున్న తన తాతయ్య (కందాళ ఉపేందర్‌రెడ్డి)ను గెలిపించాలని ఎమ్మెల్యే చిన్న కుమార్తె దీప్తి కుమారుడు దక్షు అన్నారు. అజ్మీరతండాలో ప్రచార సభలో మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నిక సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బొట్టు పెట్టి .. ఓటు అడిగి

కూసుమంచి: కందాళ ఉపేందర్‌రెడ్డికి ఓటు వేయాలంటూ మంగళవారం ఆయన కుమార్తె దీపిక తమ స్వగ్రామం అయిన రాజుపేటతో పాటు పెరికసింగారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటి వెళ్లి మహిళకు బొట్టు పెడుతూ ఓట్లు అభ్యర్థించారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, తన తండ్రి అందించిన సేవలను వివరించారు.

క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం పాఠశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్ఎం శ్రీదేవి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో ఓటు వేసేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు చుట్టు పక్కల వాళ్లకు అవగాహన కల్పించాలని సూచించారు. నూరుశాతం పోలింగ్ అయ్యేలా బాధ్యత తీసుకోవాలని వివరించారు.



మధిరలో మంగళవారం జరిగిన ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎంను బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య కలిశారు. – ఖమ్మం మయూరిసెంటర్

‘బీఆర్ఎస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు’

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్ఎస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కే.వీ.కృష్ణారావు అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ.. రిజర్వేషన్ తగ్గించి బీసీలకు అటు రాజకీయంగా ఇటు ఉద్యోగ నియామకాల పరంగా తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పది నియోజక వర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని మధుగౌడ్, నాయకులు వీరన్న, లక్ష్మణ్, రవి, తేజ, శ్రావణ్, భాను, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి..

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో నీళ్ల కోసం కట్టిన ప్రాజెక్టులు అవినీతిమయమయ్యాయని, నిధులు కేసీఆర్ కుటుంబానికి చేరాయని, నియామకాల ఊసే లేదని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ మతాలు, కులాల పేరిట విభజన తీసుకొచ్చి లబ్ధి పొందాలని యత్నిస్తుందని ఆరోపించారు. ఈనేపథ్యాన సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, యానాలి సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం

ఖమ్మంవన్‌టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను రూపొందించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, కొంగర జ్యోతిర్మయి, కీసర పద్మజారెడ్డిలు అన్నారు. మంగళవారం పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మహిళల జీవనానికి భరోసా ఉంటుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోటే ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరుస్తుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రతీ గడపకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీకళారెడ్డి, వల్లూరి ఝాన్సీ, జ్యోతి, శ్రావణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు

కూసుమంచి: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జాతీయ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు మాదిగ అన్నారు. మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన పాలేరు డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం ముందుకొచ్చినందున బేషరతుగా బీజేపీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో వర్గీకరణ పట్ల నిర్లక్ష్యం వహించిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తోళ్ల వెంకన్న మాదిగ, అధికార ప్రతినిధి చింతిర్యాల నాగభూషణం, నాయకులు కొమ్ము రోషయ్య, బాబు, వెంకటేశ్వర్లు, రాంబాబు, భాస్కర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు



ప్రచారం చేస్తున్న అప్పన పిచ్చయ్య, తదితరులు

కామేపల్లి: కాంగ్రెస్‌తోనే పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని కాంగ్రెస్ జిల్లా నాయకుడు అప్పన పిచ్చయ్య అన్నారు. మంగళవారం ముచ్చర్ల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపును కాంక్షిస్తూ గ్రామంలో ఇంటింటికి తిరిగి చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని మాయమాటలు చెబుతూ ప్రజలను మరోమారు మోసం చేయాలని చూస్తున్నారని, వారి మాటలు పక్కనబెట్టి బీఆర్ఎస్‌ను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోలా వెంకటేశ్వర్లు, సిరిపురపు రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం..



వృద్ధుడికి అన్నం తినిపిస్తూ ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ దంపతులు



గిరిజన యువకులతో మాట్లాడుతున్న అధ్యక్షుడు మంగునాయక్

కామేపల్లి: ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని కోరుతూ ముమ్మర ప్రచారం చేశారు. నెమలిపురి ఎంపీటీసీ గుగులోత్ సునీత, సుందర్ దంపతులు విన్నూత రీతిలో ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి చెందిన గుగులోత్ సోమ్లా నాయక్ అనే వృద్ధుడు ఇంటికి వెళ్లి అన్నం తినిపించి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని వినూత్నంగా కోరారు. తాళ్లగూడెం గ్రామంలో మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు ఆధ్వర్యాన ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ సుందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు గుగులోత్ కిషన్, పుచ్చకాయల బాబు, అచ్చానాయక్, ముత్యం రామకృష్ణ, సపావట్ రమేశ్, పుచ్చకాయల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువత కృషి చేయాలి..

కామేపల్లి బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బానోత్ మంగునాయక్ ఆధ్వర్యంలో ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియనాయక్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం కామేపల్లి మండలం జగన్నాథతండాలో గిరిజన యువకులతో ప్రచారం చేశారు. గిరిజన మహిళలను గెలిపించుకుంటే చట్టసభలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని మంగునాయక్ చెప్పారు.

‘బ్లూమింగ్ మైండ్స్’లో కలర్స్ డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో మంగళవారం కలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వయోలెట్ కలర్ దుస్తులు ధరించి కలర్ బెలూన్స్‌తో తరగతి గదులను అలంకరించగా.. పాఠశాల యాజమాన్యం కలర్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్లూమింగ్‌మైండ్స్ పాఠశాలలో కలర్స్ డే వేడుకలు

జోరుగా సాగుతున్న ప్రచారాలు..

సీపీఎం అభ్యర్థి తమ్మినేని

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం మంగళవారం ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా ఓ చంటి పిల్లాడిని ఎత్తుకుని ఆడించారు. ఓట్ల కోసం పాట్లు తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజా పోరాటాలే సీపీఎం అజెండా

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యలపై పోరాట విజయాలే సీపీఎం ఎన్నికల అజెండా అని, ఆ పోరాట వారసత్వం కలిగిన తనకు ఓటేసి గెలిపించాలని ఖమ్మం సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఖమ్మం టూటౌన్ ప్రాంతంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా నాయకులు దొంగల తిరుపతిరావు, నందిపాటి మనోహర్, సీపీఎం టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు మచ్చ సూర్యం, చింతల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలకు ఫ్రూట్ మర్చంట్ మద్దతు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరావును ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ మంగళవారం కలిసి మద్దతు ప్రకటించారు. సుడా డైరెక్టర్ ముఖ్తార్ షేక్ ఆధ్వర్యాన తుమ్మలను మర్యాద పూర్వకంగా కలిసి గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రూట్‌మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దల వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు అయితగాని అంజయ్యతో పాటు గఫార్ పాషా, షేక్ కలీం, గోరేమియా, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు మోదీ పెద్దపీట

ఖమ్మం మామిళ్లగూడెం: బడుగు, బలహీన వర్గాలకు ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపీట వేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బీజేపీ బలపర్చిన ఖమ్మం జనసేన అభ్యర్థి మిరియాల రామకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం బైపాస్ రోడ్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గెంటెల విద్యాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి దనియాకుల వెంకటనారాయణయాదవ్, మందా సరస్వతి, దొడ్డా అరుణ, శ్రీదేవివిజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.